

కథా కౌముది

ఋణానుబంధం మూల కన్నడ రచన: శ్రీ ప్రేమశేఖర్
తెలుగు అనువాదం: చందకచర్ల రమేశబాబు

లలిత సిమ్ కార్డుకేమో అయింది. నేను దాన్ని బయటికి తీసి కళ్ళద్దాలు తుడిచే బట్టతో తుడిచి, దాని ట్రేకు కూడా ఉఫ్ అంటు ఊది, ఏదేదో చేశాను. కానీ ఏం ప్రయోజనం కాలేదు. ఫోన్ సెట్టింగుల్ని రెండు సార్లు చెక్ చేశాను. 'దాన్నసలు ముట్టుకోనేలేదు నేను' అంటూ లలిత నవ్వుతూనే బాధపడింది. అవును. తను ఏం చేయలేదు. అవన్నీ సరిగ్గానే ఉన్నాయి. మరింకేం చెయ్యాలో తెలియక దగ్గరగా ఉన్న షాపింగ్ సెంటర్లో ఉన్న బిఎస్ ఎన్ ఎల్ ఆఫీసుకు వెళ్ళాము.

సాయంత్రం వేళ. రద్దీ లేదు. కౌంటర్లో కూర్చున్న మహిళ స్నేహపూర్వకమైన చిరునవ్వు విసిరారు. ఆమె వద్దకు వెళ్ళి సమస్య చెప్పుకున్నాము.

"పాతది కదా... అప్పుడప్పుడు ఇలా అవుతుంది. కొత్త సిమ్ ఇస్తాము. నంబర్ అదే ఉంటుంది." అన్నారు. "మంచిది" అన్నాము ఇద్దరూ జతగా. వెంటనే ఏదో గుర్తుకు తెచ్చుకుని "ఫోటో అవసరమా మేడం?" అంటూ వ్యాలెట్ తీశాను. నేను ఎప్పుడూ పెట్టుకుంటున్న నా లలిత ఫోటో ఇచ్చేస్తే పోయింది, తరువాత మరోటి పెట్టుకుంటే సరి, ఎలాగూ ఇంట్లో పదహారు ఫోటోల షీట్ ఉంది అనుకున్నాను.

ఆవిడ "అక్కర్లేదు" అన్నారు. "ఫోటో మేమే తీసుకుంటాము. మీరు మీ ఆధార్ కార్డు ఇస్తే చాలు. రెండు నిమిషాల పని." అన్నారు. లలిత తన వ్యానిటీ బ్యాగ్ మూతను పర్రంటూ లాగింది. ఆవిడ కుడివైపు మూలకు తిరిగి

"ఛాయా! ఈ మేడంది కూడా తియ్యాలి." అని అరచి చెప్పి, మమ్మల్ని అటు వైపు వెళ్ళమని సంజ్ఞ చేసింది. "ఎస్ మ్యామ్" అన్న సన్నగొంతు అటువైపు నుండి వినిపించింది.

అటు వైపు తిరిగినప్పుడు కనిపించాడు మీగడ రంగు గోడ ముందర కళ్ళలో అల్లరి నవ్వు నింపుకున్న నిలబడిన యువకుడు. అతని ఎదురుగా కళ్ళు చికిలించుకుని ఫోన్ క్యామరా రెడీ చేసుకుని నిలుచున్న యువతి. "సార్ మీరు కొంచెం కను రెప్పలు ఆడిస్తూ ఉండాలి. మూస్తూ తెరుస్తూ ఉండండి ప్లీజ్. ఒక పది సెకెండ్లు అలా చేస్తూ ఉండండి." అని సూచనలు ఇచ్చింది అతనికి. "లేకుంటే మీరు మనిషి కాదు, బొమ్మ అయ్యుండాలి అనుకుంటుంది ఇది." అంటూ వివరణ ఇచ్చింది.

"ఇదిగో నా బొమ్మా..నువ్వు కూడా మనిషి అనుకునేలా రెప్పలు కదిలిస్తూ ఉండాలి, సరేనా?" అంటూ లలితకు మాత్రమే వినిపించేలా గుసగుసలాడి ఖాళీగా ఉన్న కుర్చీల వైపు కదిలాను, లలిత చిరునవ్వును తోడుగా తీసుకుని. "రెండూ కళ్ళూ ఒకేసారి మూసి తెరవాలా లేదా ఒక కన్ను మాత్రం చాలా...?" అనే మాటలు గోడ వైపు నుండి వచ్చాయి.

"అరె!" అనుకుని అటు వైపుకు తిరిగాను. ఆ యువకుడి మొహమంతా నవ్వు.

ఆ యువకుడు అందంగా ఉన్నాడు. నల్లటి కార్గో షార్ట్స్, అర్జెంటినా ఫుట్బాల్ ఆటగాళ్ళను గుర్తుకు తెచ్చే లేతనీలం–తెలుపు టీ షర్ట్. కురుచ గడ్డం, మీసాలు నిండిన మొహమంతటా చిరునవ్వు. వయసు బహుశా ముఫై లోపు.

అతడి మాటలకు అమ్మాయి స్పందన ఎలా ఉందో అని తెలుసుకోవడానికి అటు తిరిగాను.

అప్పుడే ఇరవై దాటినట్టున్న సన్నటి శరీరంలోని ఆమె మొహం ఎర్రగా మారింది. ఎవరేమనుకుంటారో అని అటూ ఇటూ చూపు తిప్పుతోంది. దాన్ని చూస్తున్న యువకుడి మొహంలో తన అల్లరి ఈ జాగాలో, ఈ సందర్భంలో అనుచితమయ్యిందా అన్నగిల్టీ కాన్షస్. దాన్ని సమర్థించేలా అక్కడున్న ఒకరిద్దరి మొహాల్లో కనిపించిన అలాంటి భావం.

లలిత వైపు తిరిగాను. తన మొహంలో చిన్న నవ్వు. దాన్ని మరో స్థాయికి తీసుకెళ్ళి ఆ అమ్మాయిని సమీపించి పెదవి విప్పింది. "అది సరే. వాడు బొమ్మ కాడు. మనిషి. ఉత్త మనిషి కూడా కాడు, అమియబల్, హ్యూమర్ లవింగ్ యంగ్ మ్యాన్!" అంది.

ఇప్పుడు అమ్మాయి మొహంలో భయంతో కూడిన నవ్వు. నా మొహంలోనూ నవ్వు. "కన్ను కొట్టడం అనేది వాడు చేస్తే సరే. నాలాంటి వాళ్ళు చేస్తే మరి?" అన్నాను. ఆ యువకుడి మొహంలో అకస్మాత్తుగా వెలుగు. లలిత "ఆహా" అన్నది. అమ్మాయి వద్దకు జరిగి రహస్యం చెప్పేలా మెల్లగా " ఈయనేమో అలా చేసేవారే. కానీ నేను వదలి పెడతానా?"

ఆ అమ్మాయి, యువకుడు జంటగా నవ్వారు. యువకుడి నవ్వులో అదేమో నెమ్మది. 'అమ్మయ్య! తప్పించుకున్నాను. బండలా వచ్చింది మంచులా కరగిపోయింది!' అనేలా. వాళ్ళిద్దరి నవ్వులకు కౌంటర్లో ఉన్న మధ్యవయసామె మందహాసం కూడా జతకట్టింది.

★ ★ ★ ★

లలిత ఈ ఆదివారం కన్నడ బిసిబేళె బాత్, బీరకాయ బోండాలు, చివర్న చిన్ని తెచ్చి ముందుంచిన చాకో బార్. తోడుగా వేసవిలో వాన కురిసి ఉక్క కూడా. నిద్ర తోసుకు వచ్చింది.

లలిత గొంతు చెవిలో ఉన్నట్టనిపించినప్పుడే నాకు సగం మెలకువ. నాకయితే తను అరచింది ముందుగా కల అనిపించి, తరువాత చెరువు అవతల ఉన్న తెల్లరాయి కొండ పైనుండి పిలుస్తున్నట్టనిపించి, ఆ గొంతు కొండ దిగి, చెరువునూ, చాముండి వనాన్ని దాటి బెడ్ రూమ్ కిటికీకి వచ్చినట్టనిపించి, అదీ చాలదన్నట్టు లోపలిక్కూడా వచ్చి, దగ్గర్లో గుయ్ అనసాగినప్పుడు నాకు పూర్తిగా మెలకువ వచ్చింది.

"ఏవండీ! లేచి రండి, ఒక సర్ప్రైజ్" అన్నది లలిత.

నోరు కడుక్కుని, మొహం అద్దుకుని ఆత్రంగా తుడుచుకుని, షర్ట్ ఒంటికి తగిలించుకుంటూ డ్రాయింగ్ రూముకు వచ్చాను. కూర్చున్న జంట లేచి నిలబడింది.

సూటుధారి యువకుడు, చీర పొడుగు జబ్బల రవికతో ఉన్న యువతి. టీపాయ్ పైనున్న నీళ్ల గ్లాసులు మూడొంతులు ఖాళీ అయినట్టు కనిపంచాయి.

చేతులు జోడించి "నమస్తే"అని జంటగా అన్నారు. ఎవరని అర్థం కాలేదు. దాన్నే సగం ప్రశ్నలా అంటూ ఔపచారికంగా నమస్తే అన్నాను. ఇద్దరూ మాట్లాడకుండా నవ్వు విసిరారు. వాళ్ల దేహాలు కొద్దిగా ముందుకు వంగడాన్ని గమనించక పోలేదు. లలిత దగ్గరికి వచ్చి అనింది. "జ్ఞాపకం ఉందా? ఆ రోజు నా సిమ్ కార్డ్ మార్చుకోవడానికి వెళ్ళినప్పుడు... బిఎస్సెన్నెల్ ఆఫీసులో..."

గుర్తుకొచ్చింది. " ఓ సారి! వెంటనే గుర్తు రాలేదు. రెండు మూడు నెలల్లయ్యుండాలి కదా!" అన్నాను నవ్వుతూ.

నిజం చెప్పాలంటే వాళ్ళను వారం క్రితం చూసున్నా నాకు వెంటనే గుర్తుకు రావడం సందేహాస్పదమే. ఇద్దరి అవతారం మారింది. ఆ అమ్మాయి ఆ రోజులా సన్నగా కాకుండా కాస్త ఒళ్ళు పట్టింది. మొహమైతే వెడల్పుగా వికసించి ఉంది.

"ఏడు నెలలయింది సార్." అన్నది ఆమె. మొహంలో ఇంకా నవ్వు. నేను "ఓ!" అన్నాను. యువకుడు ఇంకాస్త ముందుకు వంగాడు. "మంచిదే లెండి. ఏడు నెలలు మీకు రెండు మూడు నెలల్లా అయినట్టుంది. అయితే లైఫ్ వేగంగా సాగుతోంది అన్నమాట! అంటే అంతా బాగున్నట్టే కదా! ఇలాగే ఉండాలి. నాకు సంతోషంగా ఉంది." విశాలంగా నవ్వుతూ వెనిక్కి ఒరిగాడు. "హ్హా.. హ్హా.. హ్హా..: అంటూ నవ్విన లలిత నా పక్కకు వచ్చి కూర్చుంది. యువతి "ఈ ఏడు నెలలూ నాకైతే ఏడు రోజుల్లా పరిగెత్తాయి." అంది. సన్నపాటి గొంతు. కాని నవ్వు గట్టిది. దానికి రుచికి తగ్గట్టు ఉప్పు అనేలా సిగ్గు సోపతి.

ఓ... ఏదో జరుగుతోంది!

నా నిశబ్దపు నవ్వు ఆలోచనల జాడ వాళ్ళకు తెలిపినట్టుంది. యువతి మొహం ఒంగింది. యువకుడు నిటారుగా కూర్చున్నాడు. నిదానంగా మాటలు మొదలెట్టాడు. "నేను డాక్టరి చేసింది ఇక్కడే. ఐదు సంవత్సరాల క్రితం. తరువాత ఢిల్లీలో ఎండి చేశాను. కొన్ని రోజులు అక్కడే పని చేశాను. ఇప్పుడు ఇక్కడ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం దొరికింది."

"ఓ దట్స్ నైస్! కంగ్రాట్స్!!"అన్నాను. అతడు "థ్యాంక్యూ" అంటూ మొహం విప్పార్చుకుని చెప్పి, మళ్ళీ అదే మంద గతిలో తన గురించి చెప్ప సాగాడు. "నాకు ఉత్త డాటా ప్యాక్ ఉన్న సిమ్ అవసరం ఉండింది. ఐప్యాడ్ కు నెట్ కనెక్షన్...." అతడి మాటలను సగంలోనే తుంచుతూ అంది లలిత. "దానికోసం వెళ్ళినప్పుడు ఈమె కనెక్ట్ అయ్యింది. ఏమవుతోంది అని తెలిసేలోపల కనెక్షన్ చాలా స్ట్రాంగ్ అయిపోయింది. కదా!"

తను గలగలా నవ్వితే యువతి మాత్రం తన ఒంటిని ముందుకు వాల్చి మోకాళ్ళ పైన మొహాన్ని పెట్టేసుకుంది. యువకుడు ఆమె వీపు పైన చేయి వేశాడు. చిన్న నవ్వుతో ఘోషించాడు. "పెళ్ళి చేసుకుంటున్నాము."

"వావ్" అన్నాన్నేను. లలితేమో " మంచిది. ఎప్పుడు పెళ్ళి?" అని అడిగింది. యువతి ఇప్పుడు నిటారుగా కూర్చుని అతని వైపు చూసింది. అతడు మెల్లగా దగ్గాడు.

అతడేమో చెప్పాలనుకుంటున్నాడు. పదాలకోసం తడుముకుంటున్నాడు. దేని గురించి ఉండవచ్చు? డబ్బులేమైనా అవసరమా?

అదేమైనా తనే అడగనీ. ఓపికతో వేచాను. లలిత ముందుకు వంగి చెంపకు చెయ్యి పెట్టుకుంది.

పెళ్ళికొడుకు మాట్లాడ్డం ప్రారంభించాడు. "నాకు అమ్మా నాన్న లేరు. చిన్నప్పుడే, అంటే రెండేళ్ళు కూడా లేవేమో, అమ్మా నాన్న చనిపోయారట, ప్రమాదంలో" మారిన మా ముఖ కవళికలను ఒక్క క్షణం పరికించి కొనసాగించాడు. "తరువాత నన్ను పెంచింది నా పెద్దమ్మ. ప్రైమరి స్కూలుదాకా అక్కడే ఉన్నాను. తరువాత బోర్డింగ్ స్కూల్, కాలేజ్ హాస్టల్".

విషయన్ని జీర్ణించుకోవడానికి నేను సతమతమవుతున్నాను. లలిత తన వేళ్ళ కొసలనుంచి కళ్ళంచులను తుడుచుకుంటోంది. యువతి లలిత ప్రతిబింబమై కనిపించింది.

అతడు కొనసాగించాడు. "ఇలా సాగింది నా బ్రతుకు. డబ్బులకేమీ కొదవ ఉండలేదు. తలిదండ్రుల సంపాదన. పెద్దమ్మ దాన్నంతా ఒక్క పైసాకూడా లెక్క తప్పకుండా నా పేరుకు చేసింది. అంతే కాదు. కొన్ని పెద్ద ఖర్చులను ఆమే చూసుకుంది. అన్నట్టు, ఆమె కూడా ఇప్పుడు లేరు. ఆ విషయంలో కూడా నేను దురదృష్టవంతుణ్ణి." ఆపాడు. మళ్ళీ అదే వేగంలో మళ్ళీ ప్రారంభించాడు. "కానీ, నా దురదృష్టాల వరస అక్కడితో ఆగిపోయిందట. నాకు దొరికే మూడో తల్లి తండ్రులు నా జీవితాంతం నాతో ఉంటారట. అలాగని తిరువణ్ణామలైలోని ఒక మహాత్ముడు చెప్పారు." తొందర తొందరగా చెప్పేసి చిన్నగా ఊపిరి తీసుకుని, మళ్ళీ అదే వేగంలో కొనసాగాడు. "మా అమ్మా నాన్నలు చాలా వినోద ప్రవృత్తి కలవారట. ఒకరినొకరు అల్లరి చేసుకుంటూ, ఉడుక్కుంటూ ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారట. వాళ్ళున్న చోట ఎప్పుడూ నవ్వులే ఉండేవట. ఎలాంటి టెన్షన్ వాతావరణాన్నైనా తేలిక చేసేవారట. అమ్మ అయితే చాలా బాగా మాట్లాడేదట. రాయినైనా కొట్టి మాట్లాడించి నవ్వించేదట అని పెద్దమ్మ చాలా చెప్పేది. ఆ రోజు మిమ్మల్నిద్దరినీ చూశాక, మీ ఇద్దరి మాటలు, నవ్వు విన్నాక నాకు మా అమ్మా నాన్న ఇలాగే ఉండేవారేమో అనిపించింది. అమ్మా నాన్న మళ్ళీ వచ్చినట్టనిపించింది. అందుకే...." ఆపాడు.

నేను వింటున్నది ఏమిటి అని నాకు అర్థం కాలేదు. లలిత వైపు తిరిగితే, విప్పారిన ఆమె కళ్ళు అతడి వైపే చూస్తున్నాయి. ఆపిన తన మాటలకు ముగింపు పాడుతూ అతడన్నాడు.''– మీరిద్దరూ నా అమ్మా నాన్నలై మా పెళ్ళిని జరిపించాలి.''

యువతి అతడి వైపు జరిగింది. అతడిని ఆనుకుని కూర్చుని మమ్మల్ని సూటిగా చూసింది. ''ఈయన కోరికే నా కోరిక. మీ నంబరేమో సులభంగా దొరికింది. కానీ ఇదంతా మీకు ఫోన్లో చెప్పడం కుదరదు అనిపించి మీ రికార్డులనంతా వెతికి, మీ అడ్రెస్ రాసుకున్నాను. ఇద్దరూ ఇలా వచ్చేశాం'' అంటూ నవ్వుతూ అతని వైపు చూసింది. అతడు ఆమెకు కన్ను కొట్టి నవ్వుతూ మా వైపు తిరిగాడు. '' పెళ్ళి మీరిద్దరూ, ఈమె అమ్మా నాన్నలు కలిసి నిర్ణయించిన రోజుకు జరుగుతుంది. తరువాత మాత్రం నేను మీ అబ్బాయిని, ఈమె మీ కోడలు.'' అంటూ లేచి నుంచున్నాడు. గభాలున లేచిన ఆమె చెయ్యి పట్టుకున్నాడు. ఇద్దరూ మా వైపు నిదానంగా అడుగులు వేస్తూ వచ్చి జతగా మా కాళ్ళకు దండం పెట్టారు.

నేనింకా నిద్రనుండి లేచానా లేదా అనే అయోమయంలో లలిత వైపు తిరిగాను. తనేమో ఎడమ చేత్తో పట్టుకున్న కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ కుడిచేతిని అతడి తల పైన పెట్టి ''అలాగే బాబూ'' అన్నది. గొంతు చిన్నదిగా ఉన్నా స్పష్టంగా ఉండింది.

ఇది కలా? కలే అయితే ఎలాంటి కల? గుర్తు తెలియని దిక్కునుండి వచ్చి నిలిచిన ప్రశ్నకు మనసుకు బదులు దొరకడానికి ముందే నా అరచెయ్యి వాళ్ళిద్దరినీ ఆశీర్వదించింది. ఇది కల కాదు అని నిర్ధరించుకోవడానికి తల ఎత్తి చుట్టూ ఒకసారి చూపు సారించాను. కర్టన్ పట్టుకుని నిలబడిన మా అమ్మాయి కనిపించింది. చాలా ప్రశాంతంగా ''రామ్మా'' అన్నాను. అటు తిరిగిన లలిత ''అన్నయ్య వచ్చాడు చూడు చిన్నీ'' అంది. మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలు రాసి వచ్చి, బాగా చేశాను అని చెప్పిన సంతోషంలో, కడుపు నిండా భోంచేసి, పడుకుని లేచిన కూతురి మొహంలో అమాయకమైన కుతూహలం.

''అన్నయ్య ఒక్కడే కాదు చిన్నీ, నేను వదినను కూడా వచ్చాను.'' అంటూ ఆ యువతి చిన్ని దగ్గరికి వెళ్ళి తన భుజాన్ని చుట్టింది. అతడు కూడా అటు నడిచాడు.

చిన్ని కళ్ళు ఒక్కసారి వెడల్పయ్యాయి. అతడినే ఆశ్చర్యం నిండిన కళ్ళతో చూసింది. అతడు కూడా తన అడుగులను ఆపేశాడు. ''నువ్వు....'' తరువాత మాటలు రాక నిలబడ్డాడు.

ఇదేం జరుగుతోంది అని నేను విస్మయంతో నిలబడ్డాను. అతడు మరు నిముషంలో సర్దుకున్నాడు. "హే! నువ్వు పొద్దున మా యూనివర్సిటీ మెడికల్ ఎంట్రన్స్ పరీక్ష రాయడానికి వచ్చావు కదా?" అతడి గొంతులో వినిపించింది ఆశ్చర్యమో, సంతోషమో లేదా రెండింటి మిశ్రణమో అర్థం కాలేదు.

చిన్ని సిగ్గుతో ముడుచుకుంది. చిన్నగా నవ్వుతూ "నేను కూడా అదే అనుకుంటున్నాను. ఎక్జాం హాల్ ఇన్విజిలేటర్ మాదిరిగానే ఉన్నారే ఈయన అని!" అంది.

అతడు "వాటె ప్లెసెంట్ సర్ప్రైజ్!" అంటూ సాగదీసి పైకప్పు వైపు చూశాడు. యువతి కిలకిలా నవ్వుతూ "దిసీజ్ ఎ స్మాల్ వర్ల్డ్!" అనింది. ఇద్దరూ చిన్నిని తీసుకెళ్ళి తమ మధ్యలో కూర్చోబెట్టుకున్నారు. చిన్ని సిగ్గుతో ముడుచుకుంది. ఆమె మొహంలో నవ్వు. అతడు మా వైపు తిరిగి "కొత్త బ్యాచ్ మొదటి విద్యార్థి నాకు ఇక్కడే దొరికింది!" అన్నాడు.

నాకు ఆశ్చర్యంతో చూడాలో లేక వెర్రి నవ్వు నవ్వాలో అర్థం కాలేదు. లలిత వైపు తిరిగాను. నన్ను మాత్రం కమ్ముకున్న సుందర స్వప్నం ఆమెను తన వెచ్చని కౌగిలిలోకి లాక్కుంటోందని ఆమె కళ్ళు చెపుతున్నాయి.

ఆమెనే ఒక నిమిషం పాటు చూసి ఎదురుగా చూడసాగాను. అక్కడ యువతి చిన్ని చెయ్యి నొక్కుతోంది. అతడు చిన్ని వీపు తడుతున్నాడు. మా అమ్మాయి ఇద్దరి నడుమ సమాధానంగా కూర్చుని తన ఎప్పటి అమాయక నవ్వు నవ్వుతోంది.

నా కళ్ళు మసకబారాయి.

★ ★ ★ ★

COMMENTS